క్లుప్తంగా

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చాట్రాయి: వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. ఆదివారం మండలంలోని చిన్నంపేట గ్రామంలో విజయవాడ మణిపాల్ ఆస్పత్రి, జీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ వైద్యులు ఉచిత వైద్య సేవలందించడం హర్షణీయమన్నారు. జీవీఆర్ ట్రస్టు, మణిపాల్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

వేంకటాచలుడికి ఫలయాగం



తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాసం సందర్భంగా ఫలయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని, స్వామివారిని 16 రకాల ఫలాలతో అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. వైష్ణవ గోష్ఠి సభ్యులు, భక్తులు విష్ణు సహస్ర నామం పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఫలయాగాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

మైలవరం నుంచి శబరిమలకు సైకిల్ యాత్ర



మైలవరం: మైలవరంలో అయ్యప్ప మాల ధరించిన 19 మంది భక్తులు మైలవరం నుంచి శబరిమలకు ఆదివారం సైకిల్ యాత్ర చేపట్టారు. స్థానిక శివాలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం సైకిల్ యాత్ర ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 19 మంది అయ్యప్ప భక్తులు శబరిమలకు సైకిల్‌పై వెళ్లాలని నిర్ణయించుకున్నారు. స్థానిక భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం యాత్ర ప్రారంభించారు. వీరి యాత్ర విజయవంతం కావాలని తోటి స్వాములు ప్రత్యేక పూజలు చేసి కొంత దూరం వారితో యాత్రలో పాల్గొన్నారు.

తోటపల్లి యువకుడికి పీహెచ్‌డీ



శివరాంబాబు

ఆగిరిపల్లి: తోటపల్లికి చెందిన పామర్తి వెంకట శివ రాంబాబు పూణే ఎన్ఐటీ కళాశాల నుంచి పీహెచ్‌డీ డిగ్రీ పట్టా అందుకున్నాడు. 'వ్యవసాయ వినియోగాలకు వైర్ లెస్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ల కోసం డ్రోన్ మార్గం' అంశంపై ఆయన చేసిన పరిశోధనకుగాను ఈ పురస్కారం లభించింది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన శివరాంబాబు, బాల్యం నుంచి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివి పీహెచ్‌డీ పట్టా పొందడాన్ని విద్యావంతులు, మండల ప్రజలు అభినందించారు.

మాదిగల అభ్యున్నతికి వర్గీకరణ దోహదం



చాట్రాయి: మాదిగల అభ్యున్నతికి ఎస్సీ వర్గీకరణ దోహదపడుతుందని ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మలుగుమాటి రఘురాం అన్నారు. ఆదివారం చనుబండ గ్రామంలో ఎంఆర్‌పీఎస్ గ్రామ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కారుమంచి ఇస్తేరయ్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా విస్సంపల్లి రాజా మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గద్దల కుటుంబరావు మాదిగ, ట్రెజరర్‌గా విస్సంపల్లి నరేష్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా కంచర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం

గంపలగూడెం: అనునిత్యం ఉదయాన్నే సూర్య నమస్కారాలు చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం అర్చకుడు దేవయజనం శ్రీధరాచార్యులు అన్నారు. మార్గశిరమాసం చివరి ఆదివారం సందర్భంగా ఆలయంలో సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సూర్య నమస్కారాలు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 14వ రోజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, తిరుప్పావై పఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డ్రైఫ్రూట్స్‌తో వటపత్రశాయిని అలంకరించారు. ఆలయంలో దీపోత్సవం కనులవిందుగా జరిగింది. స్థానిక భజన మందిరంలో భగవత్ గీతా పఠనం చేశారు.

ట్రిపుల్ ఐటీలో ఐటీ కోర్సుల ఎత్తివేతకు సన్నాహాలు?

- ఆందోళనలో విద్యార్థులు, ఫ్యాకల్టీలు
- రానున్న కాలమంతా ఏఐ, మెషీన్ లెర్నింగ్‌తోనే



నూజివీడు ట్రిపుల్ ఐటీలోని అకడమిక్ భవనం

నూజివీడు: ఎంతో ముందుచూపుతో పేద విద్యార్థుల కోసం ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటీల ప్రతిష్ఠను దిగజార్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంప్యూటర్, ఐటీ రంగంలో నూతన కోర్సులను విద్యార్థులకు నేర్పించాల్సింది పోయి, ఉన్న ఐటీ కోర్సును ఎత్తివేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ వంటి కోర్సులతో పాటు మరిన్ని అడ్వాన్స్‌డ్ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలే గానీ ఉన్న కోర్సులను ఎత్తివేయాలనుకోవడమేమిటో అర్థం కావడం లేదు. 2008లో ఎంతో ముందుచూపుతో తీసుకువచ్చిన ఐటీ కోర్సును ఎందుకు ఎత్తివేయాలనుకుంటున్నారో తెలియడం లేదని, దీనివల్ల విద్యార్థులకు ఎంతో నష్టం వాటిల్లుతుందనే ఆందోళన ట్రిపుల్ ఐటీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ట్రిపుల్ ఐటీ సంస్కరణల కమిటీ సమావేశం ఆన్‌లైన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నాలుగు ట్రిపుల్ ఐటీల డైరెక్టర్లు, సెంట్రల్ డీన్, ఐటీ హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కొందరు ఐటీ కోర్సును తొలగించడం సమంజసం కాదని పేర్కొన్నట్లు సమాచారం.

పీయూసీ నుంచే ఐటీ కోర్సు

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు 2008 నుంచి పీయూసీలోనే ఐటీ కోర్సును ఏర్పాటు చేశారు. దీనిని బోధించేందుకు ఐటీ మెంటార్లను నియమించారు. వీరు పీయూసీ ప్రథమ సంవత్సరంలో కంప్యూటర్స్ బేసిక్స్, ద్వితీయ సంవత్సరంలో పైథాన్, వెబ్ డిజైనింగ్, ఓపెన్ ఆఫీస్, లేటెక్స్ అప్లికేషన్స్ వంటి వాటిని విద్యార్థులకు నేర్పుతారు. పీయూసీ రెండేళ్లలో నాలుగు సెమిస్టర్‌లలో సైతం ఐటీ పరీక్ష రాస్తారు. పీయూసీలో కంప్యూటర్ కోర్సులను నేర్చుకోవడం వల్ల ఇంజినీరింగ్‌లోకి వెళ్లిన తరువాత విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం మరింత సులువుగా ఉంటుంది. ఇంజనీరింగ్‌లో సీ, సీ++, జావా వంటి కోర్సులతో పాటు మరిన్ని అడ్వాన్స్‌డ్ కోర్సులను విద్యార్థులకు నేర్పుతారు. పీయూసీలో ఐటీ కోర్సు ఉండి అక్కడ బేసిక్స్, ఇతర కోర్సులను నేర్చుకోవడం వల్లనే ఇంజినీరింగ్‌లో విద్యార్థులు మరింత సులువుగా ఇతర కంప్యూటర్ కోర్సులను నేర్చుకోగలుగుతున్నారనేది అందరికీ తెలిసిందే. అంతేగాకుండా ప్లేస్‌మెంట్‌లను సులువుగా సాధించడంలో ఐటీ కోర్సులు ఎంతో దోహదపడుతున్నాయి. ఐటీ కోర్సులను తీసివేయాలనే ప్రపోజల్స్ ఎందుకు పెట్టారనేది విద్యార్థులకు, ఫ్యాకల్టీలకు అర్థంకావడం లేదు. రాను రానూ ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటి కోర్సులను పరిచయం చేయడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న అడ్వాన్స్‌డ్ కోర్సులను ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశ పెట్టాల్సింది పోయి, ఆ పని చేయకపోగా ఉన్న కోర్సులను తొలగించాలని ప్రయత్నిస్తుంటే ట్రిపుల్ ఐటీలను ఇంజినీరింగ్ కళాశాల స్థాయికి తీసుకెళతారా అనే అనుమానులు సైతం విద్యావంతుల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా ఇలాగే ఐటీ కోర్సును తొలగించాలని చూస్తే అప్పటి చాన్సలర్ కేసీ రెడ్డి ఒప్పుకోలేదు. మళ్లీ దానిని ఇప్పుడు తెరపైకి తీసుకురావడం గమనార్హం. ఇప్పటికే అనేక మార్పులు చేసుకుంటూ వస్తూ ట్రిపుల్ ఐటీ స్థాయిని తగ్గించే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో తిరోగమన చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చౌకధరల దుకాణాల అభ్యర్థులకు గాలం

తిరువూరు: తిరువూరు డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన షాపులకు డీలర్ల నియామకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు దళారుల బెడద అధికమైంది. డీలర్‌షిప్ కావాలంటే తమను సంప్రదించాలని, తాము అడిగిన డబ్బు ఇస్తేనే దుకాణం కేటాయిస్తారని చెబుతూ లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు డీలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు రాతపరీక్ష నిర్వహించారు. తుది ఎంపిక జరిగే లోపు దళారులు అభ్యర్థుల్ని ప్రలోభపెట్టి డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.

వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా లక్ష్మణరావు

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరులో వాసవీ, వనిత, కన్యక క్లబ్‌ల నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వాసవీక్లబ్ అధ్యక్షుడిగా కోరకొండి లక్ష్మణరావు, వనిత క్లబ్ అధ్యక్షులుగా కోట నాగమణి, కన్యక క్లబ్ అధ్యక్షులుగా పద్మనాభుని కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు కాజా నాగేంద్రరావు, వి. ప్రకాష్‌బాబ్జీ, పి. సర్వేశ్వరరావు, కాజా శ్రీనివాసరావు, వజినేపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

మరుగున పడిపోయాయి





తహసీల్దారు కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు ; తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో లేని మరుగుదొడ్లు

- పదేళ్ల కిందట నిర్మాణం
- నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు
- ఆ అవసరానికి ప్రజల ఇబ్బందులు



తిరువూరు బస్టాండ్ సెంటర్లో మూసివేసిన మరుగుదొడ్లు

తిరువూరు: నిత్యం రద్దీగా ఉండే తిరువూరు పట్టణంలోని పలు కూడళ్లలో గతంలో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నిర్వహణా లోపంతో మూతబడ్డాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కొత్త బస్టాండ్ సమీపంలో పదేళ్ల కిందట నగర పంచాయతీ నిర్మించిన మరుగుదొడ్లను నిర్వహణ నిమిత్తం ఎవరికీ అప్పగించకపోవడంతో తాళాలు వేశారు. మహిళలు మెయిన్ రోడ్డులో దుకాణాలకు కొనుగోళ్ల నిమిత్తం వచ్చినపుడు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరువూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద 2017లో నగర పంచాయతీ నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు సైతం నిర్వహణా లోపంతో నిరుపయోగంగా మారాయి. రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లకు తలుపులు లేక, కాపలాదారు లేకపోవడంతో రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

నగర పంచాయతీ కార్యాలయంలో..

తిరువూరు నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు సైతం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని పలువురు భావిస్తున్నారు. పట్టణంలో కొత్తగా మరుగుదొడ్లు నిర్మించాలని కౌన్సిల్ సమావేశాల్లో ప్రతిపాదిస్తున్న కౌన్సిలర్లు, అధికారులు ఉన్న మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకోడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సిబ్బంది కొరతే కారణం

నగర పంచాయతీ నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణకు సిబ్బంది కొరత ఉంది. బస్టాండు వద్ద, తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న మరుగుదొడ్లను లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదించాం. త్వరలోనే వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– గత్తం కస్తూరిబాయి, నగర పంచాయతీ చైర్‌పర్సన్, తిరువూరు

ప్రజల ఇబ్బందులు గమనించాలి



నానాటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వివిధ ప్రాంతాల నుంచి తిరువూరుకు వచ్చే వారికి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి. ముఖ్య కూడళ్లలో కనీసం మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి.

– యరదేశి రామారావు, తిరువూరు

వినియోగంలోకి తీసుకురావాలి



తిరువూరు నగర పంచాయతీ లక్షలాది రూపాయల ఖర్చుతో నిర్మించిన మరుగుదొడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రధాన కూడళ్లలో మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– షేక్ సుబానీ, తిరువూరు

రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక

నూజివీడు: రిమాండ్ ఖైదీలకు న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్థోమత లేకపోతే ఆ విషయాన్ని మండల న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకువస్తే వారికి ఉచిత న్యాయ సాయాన్ని అందజేస్తామని ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అన్నారు. స్థానిక సబ్ జైల్‌ను ఆదివారం ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా సెక్రటరీ కేవీ కృష్ణయ్య సందర్శించారు. సబ్ జైలులో వసతులు, రిమాండ్ ఖైదీల ఆరోగ్యం, వారికి అందుతున్న ఆహారం తదితర అంశాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జైలు పాలవ్వడం వల్ల సమాజంలో చిన్నచూపు చూస్తారన్నారు. విలువైన కాలం, డబ్బులు వృథా అవ్వడమే కాకుండా కుటుంబానికి దూరమవుతారని చెప్పారు. ప్రతి ఒక్కరూ సక్రమ నడవడికను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు, జైలు సూపరింటెండెంట్ గంగినేని ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాత నేరస్తులకు పోలీసుల హెచ్చరిక



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ. సర్కిల్‌లోని వ్యక్తి ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి

మైలవరం: రెడ్డిగూడెం మండలంలోని పాత నేరస్తులను ఆదివారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ మోహనరావు హెచ్చరికలు జారీ చేశారు. సారా వ్యాపారులు, రౌడీషీటర్లు తమ పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కొత్త జీవితం ప్రారంభించాలన్నారు. ఇదిలా ఉండగా స్టేషన్‌కు పిలిపించిన వారిలో అధికార పార్టీకి చెందిన మండల స్థాయి నాయకుడు (ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి, తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు) కూడా ఉండటం విశేషం. తాను అధికార పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేశానని, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలో రెండు వర్గాలు ఏర్పడటంతో స్థానిక టీడీపీకి చెందిన ఒక వర్గం నాయకులు చెప్పినట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీకి చెందిన కొంతమంది నాయకులే తనపై రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను స్టేషన్‌కు పిలిచి పోలీసులు వార్నింగ్ ఇవ్వడంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

సమస్యలపై ప్రజల పక్షాన పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీవీ కృష్ణ

తిరువూరు: తమ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే పోరాడుతుందని, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. జనవరి 3, 4, 5 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు తిరువూరులో జరుగనున్న సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కిడ్నీ రోగుల సమస్యలపై నిరంతర పోరాటం చేసి ఐదు డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుకు కృషిచేశామన్నారు. ఇటీవల సంభవించిన వరదల్లో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలకు తమ పార్టీ ఎనలేని సేవ చేసిందని చెప్పారు. కోవిడ్ సమయంలో తమ పార్టీ కార్యకర్తలు రోగులకు అందించిన సేవలను ప్రజలు గుర్తించారన్నారు. తిరువూరులో 1960లో జిల్లా మహాసభ జరిగిందని, మళ్లీ ఇప్పుడు ఎన్టీఆర్ జిల్లా మహాసభ జరుగుతోందన్నారు. 250 మంది ప్రతినిధులు మహాసభకు హాజరవుతారని, 3వ తేదీన బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఎం. నాగేంద్ర ప్రసాద్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కల్యాణ్, నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీటి ప్రవాహం



ఈదరలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఆగిరిపల్లి: మేజర్ పంచాయతీ ఈదరలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రోడ్లపైనే మురుగునీరు పారుతుండడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈదరలోని బస్టాండ్ రోడ్డు వద్ద మురుగునీరు, చెత్తా చెదారంతో కలిసి రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్తులు, ప్రయాణికులు వాపోతున్నారు. మురుగ నీటితో ఇబ్బంది పడుతున్నామని పలుమార్లు సర్పంచ్, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జూదాల నియంత్రణకు డ్రోన్ల సేవలు

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో జూదాల నియంత్రణకు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం కోకిలంపాడులో డ్రోన్ ఎగురవేసి ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య పరిశీలనకు, జూదాల నియంత్రణకు డ్రోన్లను వినియోగించుకుంటామని చెప్పారు.

170 మందికి వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కూటమి నాయకుడు అక్కల గాంధీ శిబిరాన్ని ప్రారంభించారు. విజయవాడకు చెందిన సెంటినీ హాస్పిటల్, వశిష్ఠ దంత వైద్యశాలల వైద్యులు రోగులకు గుండె, ఊపిరితిత్తులు, ఎముకల పటుత్వం, మోకాళ్ల నొప్పులు, దంత పరీక్షలు, మధుమేహం, బీపీ తదితర వ్యాధులకు సంబంధించి 170 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వంగవీటి రాధా, రంగా జ్ఞాపకార్థం సీనియర్ నాయకులు నాగబత్తుల నాగబాబు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

నేడు 'మీకోసం'

నూజివీడు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో మీకోసం కార్యక్రమం నిర్వహిస్తామని, రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు.

- ముసునూరు: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ పురుషోత్తమశర్మ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేస్తే గడవులోగా పరిష్కరిస్తామన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ విజయలక్ష్మి ఆదివారం విలేకరులకు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే సభకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తిరువూరు: స్థానిక జగన్నాథపురం పాటిమీద దాసాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలిచ్చారు. జవాజి రాము రూ.50,116, జవాజి శ్రీనివాసరావు రూ.లక్ష, నాళ్కా నరసింహారావు రూ.75,116 విరాళాలను అందజేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయని, దాతలు తగు సహాయ సహకారాలు అందించాలని కమిటీ కోరింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

తోటమూల(గంపలగూడెం): మండలంలోని తోటమూల మధిర స్టాండ్‌కు చెందిన శ్రీసాయి ఆటో వర్కర్స్ యూనియన్ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా బలవంతపు చిన్న, ఉపాధ్యక్షుడిగా జొన్నలగడ్డ కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా కొంగల రమేష్, కార్యవర్గ సభ్యులుగా పల్లపు మారేసు, కంచపోగు ప్రభాకరరావు, గౌరవ సలహాదారులుగా ముత్యాల శ్రీనివాసరావు, కొంగల ప్రభాకరరావు ఎన్నికయ్యారు.

అపూర్వం.. ఆత్మీయ కలయిక



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలో అలిగినేని పెద ముత్తయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–1999 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హైస్కూల్‌లో ఆనందోత్సాహాల మధ్య ఆదివారం జరిగింది. ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకుని ఉద్వేగానికి గురయ్యారు. విద్యార్థి దశను గుర్తు చేసుకుంటూ మధురస్మృతులను నెమరువేసుకున్నారు. చదువుకున్న రోజుల్లో నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులు తెలుగు మాస్టారు శర్మ, లెక్కల మాస్టారు రామాంజనేయులు, సైన్స్ మేడమ్ కృష్ణవేణి, డ్రిల్ మాస్టారు సుధాకర్, డ్రాయింగ్ మాస్టారు వెంకటేశ్వరరావులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. అందరూ కలిసి భోజనాలు చేశారు.

రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి



స్వామీజీ ఆశీస్సులు అందుకుంటున్న మంత్రి పార్థసారథి

నూజివీడు: పట్టణంలోని దత్తాశ్రమంలో నూతనంగా నిర్మించిన శ్రీ అనంతేశ్వరాలయ ప్రతిష్ఠా కార్యక్రమానికి విచ్చేసిన అవధూత గణపతి సచ్చిదానందస్వామీజీని ఆదివారం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కలిసి స్వామీజీ ఆశీర్వచనాలను అందుకున్నారు. అనంతరం అనంతేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు, దత్త విజయానంద స్వామివార్ల ఆశీర్వచనం తీసుకున్న మంత్రి మాట్లాడుతూ దత్త స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవదత్త స్వామి అనుగ్రహంతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ కొమ్ము వాసు తెలిపారు. రాజవరం, తునికిపాడు, పెనుగొలను, మేడూరు, సత్యాలపాడు, చల్లగుండ్లవారిపాలెం, చింతలనర్వ, చెన్నవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు. అదేవిధంగా గంపలగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటినెన్స్ వర్కు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.